సరేగాని నువ్వు ఘుగవేషం వేసుకుంటే సీ చీరకట్టు కొన్నది మీ అక్కయ్యా! అని నేను అడిగినాను.

అవును అని కాంతం హేళనచూపుతో నావైపుచూస్తూ మీ కంతకోపం ఎందుకు! పరపురుషునితో మాట్లాడితే కోపం లేదుగా! అన్నది.

సరిలే ఊరుకో! ఎవరికైనా వాళ్ళు తెలియదు. ఆ సమయములో ?

ఇప్పుడైన బోధపడ్డదా ?

ఆ దెబ్బ తగిలిందా ?

దెబ్బ తగిలితే ఎఱుగరూ. ఈ తమలపాకుల ప్రాప్తి లేకపోయేదే. మీ కే యీ దెబ్బ...... అని తన విజయాన్ని సూచిస్తూ ఓరగన్నులతో నవ్వింది. మిగలబండిన తమల పాకులవంటి కాంతం చెక్కిళ్ళు కెంపెక్కడము చూస్తూ అదే పనిగా తమలపాకు మడుపులు నోటితో అందుకోసి నములు తున్నాను. మడుపులు అందిస్తూవున్న చేతిని విదిలించి అబ్బా! అన్నది కాంతం——

మా కాంతం

కాంతం నామీద విరోధం కట్టింది. పెద్ద యుద్ధం గింది. ఆమె ఆఖరుకు అశ్రుధారాస్త్రము ప్రయోగించింది.

అంతవరకూ ఎందుకొచ్చిందంటారు! అసలు సంగతి మీకు మూడు ముక్కలలో చెప్పేస్తాను. కాంతం నన్నేమో పట్టి తెలివితక్కువ నాగన్న క్రింద కట్టేస్తుంది. ఏదో నేనూ బి. ఏ, దాకా చదువుకొన్నాను! కొద్దో గొప్పో ఆంధ్ర వాఙ్మయంలో కూడా నాకు పరిచయం ఉందా. కవిత్వం చెప్పలేకపోయినా పద్యం అర్థం చేసుకోగలను గదా మరి నన్ను బట్టుకొని పట్టి తెలివితక్కువ పుల్లాయక్రింద జూస్తే వళ్ళు మండదూ. నావళ్ళు మండి నేను నాలుగూ అనేశాను.

ఈ విషయంలోనే కాదు ప్రతి విషయంలో నన్నుగూర్చి సగౌరవంగా ప్రవర్తించదు. నేను బజారుకు వెళ్ళితే సరిగా బేరం చెయ్యందే ఏ వస్తువును తీసికొనిరాను. అయితే ఒక డబ్బు ఎక్కువయినా మంచి సరుకు తెస్తాను. రెండు మూడు కొట్లు చూచి అక్కడ కొనేవాళ్ళను విచారించి ధర తెలిసి కొని మరీ కొంటాను. అటువంటి సమయంలో ఎంత మంచి వంకాయలు తెచ్చినా ఇంటికి రావడంతోనే ఎబ్బే! ఇవ్వేమి వంకాయలు. గట్టిగా రాళ్ళలాగ ఉన్నవి.. కసరెక్కినవి. ఎవ్వరో మీకు టోపీ వేశారు. సీతమ్మ కొన్నది వంకాయలు! ఎల్లావున్నవి అనుకొన్నారు? లేత మువ్వలు. కూర

వండితే వెన్నలాగ ఉంటుంది. మీరు ఏం తెచ్చినా అంతే అంటుంది. అని అంతతో ఊరుకోక ఎంతకు కొన్నారు అంటుంది. నేను అబద్ధము ఏమని చెప్పేది. అర్థపావలాకు కొన్నాను సవాశేరు అని చెప్పేస్తాను. అప్పటికి ఒక అర్ధణా తగ్గించే చెప్తాను. వెంటనే అయ్యో! అయ్యో! అర్థపావలే? సీతమ్మ అణాన్నరకే కొన్నది. ఇంటికొచ్చి అణాన్నరకు యిచ్చి పోతుంటె మీరు బేరా పెట్టుకొని పైగా అర్ధణా కూలికూడా పెట్టారు. ఇంకేమి సంసారం ఇంకేమి పొదుపు' అని సాధింపు మొదలుపెడుతుంది—

అటువంటి సమయములో నాకు అరకాలిమంట నెత్తి కొస్తుంది. జగన్నాథంకూడా యిల్లాగే కొన్నాడే. పైగా యిద్దరు ముగ్గురు కొంటుండగా చూచాము అంటె "ఇద్దరు ముగ్గురు కొనాల్సిందే. జగన్నాథం ఉండనే ఉన్నాడు మీకు తోడు డబ్బుతగలెయ్యటానికి అంటుంది. దానితో వళ్ళు మండుతుంది. నేను చేసిందంతా తెలివితక్కువ బేరంకావాలి! జగన్నాథం తెలివితక్కువవాడే! తాను ఒక్కతే మేధావి కాబోలు! పైన అంతా నన్ను గౌరవిస్తారు. ఇంట్లో నన్ను జూస్తే ఇంత అగౌరవం. అందుచేత వళ్ళుమండి నాలుగు మాటలూ అన్నాను. అదిపోట్లాటకు కారణం.

ఇప్పుడేకాదు. ఇదివరలోను ఇల్లాగే జరిగింది. నెల ఆఖరుకు జీతం వచ్చింది. ఆరోజు కాంతానికి మంచిచీర కొని పెడదామని బుద్ధిపుట్టింది. చాలా సరదాగా బజారుకువెళ్ళి

చీరలు బేరంచేశాను. కొర్నాటిచీరలు పునహాచీరలు కొనలేక సంసారపక్షంలో పట్టంచుచీర ఒకటి పన్నెండురూపాయలకు కొన్నాను. ఆచీర నాకెంతో బాగున్నది. ముచ్చటపడికొన్నాను. ఎప్పుడు తీసికొనివెళ్ళి కాంతానికి చూపుదామా అని ఆదుర్దా ఎక్కువయింది. ఎప్పుడు జీతంవచ్చినా ఏదో ఒక రవికగుడ్డో పకోడీల పొట్లామో కాంతానికి తీసికొనివెళ్లే అలవాటు. ఆరోజు పన్నెండు రూపాయలు చీర కట్టుకొంటె ఎంత సంతోషిస్తుందో, నాకేమి బహుమానం ఇస్తుందో అనుకొంటూ ఆచీర కట్టుకొంటె కాంతం ఎల్లావుంటుందో అని గుటకలేస్తూ ఇంటికివచ్చాను. గడపలోనే కాంతం కనిపించింది.

కాంతం ఇవ్వాళ నీకో మంచి బహుమానం తెచ్చాను. ఏమిస్తావు.

—ఏమిటి చెప్పండి.

—ఏమిస్తావు చెప్పు.

—ఏమిటి చెప్పేది ఇంట్లో ఉండనిస్తా. చూపించండి వెనక దాచుకొంటారేమి, అయినా మీకిచ్చేదేమిటి. మాకిచ్చే బహుమానం తెలియదా. పకోడీ పొట్లామే కా?

—అదికాదు గొప్పబహుమానం తెచ్చాను. ఏమిస్తావో చెపితేనేగాని చూపను.

—చూపరు. మీరుచూపకుండా నేనే చెప్పేస్తాను

కాంతం చెప్పేస్తానన్నది. ఎల్లా చెప్పేస్తుంది చెపుమా!

ఎవడైనా స్కూలు కుర్రాడు చెప్పేశాడా అని అనుమానం కలిగింది. అల్లాజరుగుతుంటుంది లెండి! స్కూలు కుర్రా

ళ్ళు కొంతమంది మాయింటిప్రక్కనే వున్నారు. స్కూలులో జరిగిన ప్రతివిషయం యింట్లో ఇట్టే ఊదేస్తారు.

ఇంటికి రావటంతోనే కాంతం 'ఏమండోయి యివ్వాళ పంతులుగారిని రాముడు ఎదిరించాడట' (అసలు వెక్కిరించాడని కుఱ్ఱాళ్ళు చెప్పిఉంటారు) అని ఇవ్వాళ పంతులుగారికి పరాభవం కలిగిందట అని అంటుంది.

—నీ ముఖం కాదూ! నాకేమి పరాభవము! అని నేను.

—నాదగ్గర దాచబోకండి మీకు జరిగినపరాభవం నాకు తెలుసును. 'ఆర్యుల ఆహారము ఏమిటిరా' అని మీరు అడిగారట. వాళ్లు పండ్లు కాయలు అని అన్నారట. ఇంకేమి తినే వాళ్ళు వాళ్ళుఅని అన్నారట. అప్పుడు మీరు మీఅలవాటు ప్రకారం గోళ్లుకొరుక్కొంటుఉంటే ఆగుంట వెధవ 'ఇంకేమి తినేవాళ్ళండి—గోళ్ళు' అని అన్నాడటగా.

నిజమే. ఆమాట బాగాఅన్నాడు. ఇంతనాగరికత బలిసిన కాలంలో చదువుకొని బి. ఏ. బి, ఎలు. ప్యాసుఅయినవాళ్ళే గోళ్ళుతింటుంటే ఎప్పుడో ఇక్ష్వాకులకు పూర్వకాలంలోఉన్న మనుష్యులు గోళ్ళు తిన్నారనటంలో విపరీతం ఏముంది? మీసాలుకూడా 'చీకేవాళ్ళంటే 'మరీ బాగుండేది. అని ఎత్తి పొడుస్తుంది. ఇటువంటివి చాలా ఉన్నవి. ఇంతకు ఇప్పుడు చెప్పదలచు కొన్నదేమిటంటేసరే ఆరోజు నేను తెచ్చింది చూపించనంటె చూపించనన్నాను. ఎట్లాచెబుతుందో చూద్దామనిఅనుకొని ఎవరైన కుఱ్ఱవాడు చెప్పేశాడా ఏంరా

బాబు? వారిలో ఎవరెవరు కనిపించారు చెప్పాన్రా అని కొంచెం పరధ్యానంగా ఆలోచిస్తుంటె గబగబవచ్చి చీరను లాక్కొని చీరా! మీరు కొన్నది అని అన్నది. చీరఅటుఇటు పరాకాయించి చూచింది. ఊరుకొన్నది.

నావళ్ళు చల్లబడ్డది. నేననుకొన్న సంతోషమేద్ది. నేనను కొన్న సరదాఅంతా నసుసిపోయినది. అటుతరువాత ఏమన్నదో తెలుసునా? సిగ్గుచేటు మొదట ఊరుకొన్నది నేను-చీర బాగున్నదా అని అడిగాను.

"బాగుండకేమిలెండి బాగున్నది. ఏమన్నాఅంటే కోపమాయెను. మొన్న సుబ్బమ్మ కొన్నచీర చూచారా? పండంటి చీర పదిరూపాయలకు కొన్నది. ఆచీర చూడ్డండి ఈచీర చూడండి. ఈచీర తెలతెల బోతున్నది. చేసేవన్నీ ఇటువంటి బేరాలు. ఏమన్నా అంటె కోపమాయె." అని అన్నది. ఇంకేమున్నది. కొండవిరిగి మీదపడ్డట్లయింది. గంపెడంత ఆశతో ఏమో సంతోషిస్తుందని భ్రమపడితే ఏమీ లేదు, నేమళ్ళీ తెలివితక్కువ వాణ్ణి అయినాను. నాకంటె సుబ్బమ్మలు వెంకమ్మలు తెలివిగలవాళ్ళు. నిలువున నీరైపోయినాను. సుబ్బమ్మచీర వెలుస్తుందో ఇది వెలుస్తుందో ఏది గట్టిదో ఏది మంచిదో ఎట్లా నిర్ధారణ చేయటం? ఏకోర్టువారు తీర్పుచేస్తారు? సుబ్బమ్మను అక్కడికి ఎల్లాపిలిపించేది? సరేఅని ఊరుకొన్నాను. కాంతం ఏదో ఆనందపారవశ్యమున తేలుతుందనుకొంటే పారవశ్యంలేదు పాడూలేదు.

పైగా ముఖం చిట్లించుకొంది! ఇది మా కలహాలకు కారణం.

సంసారం కొంచెం కష్టదశలో ఉండటంవల్ల కిరసనాయులు డబ్బా తెచ్చుకోలేక సీసాతోనే తెచ్చుకొంటున్నాము నెల రోజులనుంచి. ఒక రోజున సీసాపట్టుకెళ్ళి కిరసనాయులు తెచ్చాను. ఆమెవచ్చిచూచి ఇదేమికిరసనాయులు వెధవ కిరసనాయులు. ఎట్లానూ తెచ్చారేం. అయ్యయ్యో అని గొణుక్కొంది. ఎంతకుకొన్నారంటె బేడా అర్ధణా అని చెప్పాను అయ్యో పదికానులే? ఒక అణా దండగపెట్టారు. ప్రతిదానిలో ఇల్లా పాడుజేస్తుంటె ఏమి సంసారం చేసేది నా ముఖం. ప్రతివాడికీ అదేం పొయ్యేకాలమోకాని మీ ముఖంజూస్తే ధర ఎక్కువ చెబుతారు అనిగట్టిగా అనేసింది. నోరుమూసికొని ఊరుకొన్నాను. ఏమిజేసేది.

సరే ఇల్లా కొన్నాళ్ళుజరిగింది. మాయింట్లో రాచిప్ప దాని ధర్మానపగిలిపోయింది. రాచిప్పకథ వేరేఉంచి దానిని నేను కొనటం అది బాగుంది కాదనటం దానికిముడిఉందనటం రోజూపులుసుకాచేటప్పుడు నన్ను ఎత్తిపొడవటం ఆగొడవ అంతా చెప్పుకుంటె చాలాఉంది. సిగ్గుకూడా.

దానిధర్మాన రాచిప్ప పగిలిపోయింది ఈతభా రాచిప్ప నేను తేనన్నాను. తెచ్చినందుకు అనుభవించాను చాలు నీవు పోవలసినదే, కొనుక్కోవలసినదే అనిచెప్పాను. కొంత వాదంజరిగిపోయిన తరువాత పోవటానికి ఒప్పుకుంది. బజారుకు

పోయి కిరసనాయులు నిప్పుపెట్టెలుకూడా తెమ్మని చెప్పాను.

బయలుదేరటానికి ఎంతో అడావిడిచేసింది. నేనుకూడావస్తాను. అన్నాన్ద్వారల వలెమనమూ—చరచరమను కొంటూ-పరచ కెడదాము రావె:—అని పాటపాడాను. కాంతానికి ఎక్కడలేనిసిగ్గు వచ్చింది, నన్ను రావద్దన్నది. నేనువస్తానన్నాను నేను వస్తే తాను బజారుకు పోవటం మానుకొంటానన్నది. సరే ఏంజేసేది? పోనీలెమ్మని ఊరుకొన్నాను. బజారుకు పోవాలంటె మనము ఏదోపైన ఉత్తరీయం వేసుకొని బయలుదేరుతాము. కాంతం బజారుకువెళ్ళేటందుకు బ్రహ్మప్రయత్నం చేసింది. తలదువ్వి పూలుపెట్టుకొంది. ఊదా చీర కట్టి బయలుదేరింది చివరకిల్లాగో బావమరది పదిఏండ్ల గుంటవెధవ ఆమెకుతోడు. జట్కాబండి కట్టించుకొని పొమ్మన్నాను. ఎందుకు అదోదండుగ అని కాలినడకమీదనే బయలుదేరింది. నేను బడిలోకి వెళ్ళిపోయినాను.

బజారులో జరిగిన విషయం అంతా తరువాత మాబావమరిది చెప్పాడు. రాచిప్ప దుకాణందగ్గర ఒక ఘంటసేపు బేరంచేసిందట—ఆ రాచిప్ప కాదని ఈ రాచిప్ప ఇదికాదని అది తెప్పించి వాడి దుంప తెంపి—ఆఖరుకు ఒకటి కొన్నది.

ఇక కిరసనాయులు కొంటానికి బయలుదేరింది. ఇక్కడే వచ్చిన ఉపద్రవం. నేను సీసా బేడా అర్ధణాకు తెచ్చాను. తాను సీతమ్మకొన్న ధర ప్రకారం అణాన్నరకు పోయించుకురావలె. ఏకొట్లో అడిగినా బేడాఅర్ధనా మూడుఅణాలు చెప్పటం

ప్రారంభించినారు. అప్పుడు ఏమనుకొంది బేడాఅర్ధనాకు పోయించుకు వెళ్ళితినా నాగొప్ప ఏముంది. ఇదివరకు ఆయన విసుక్కొన్నందుకు నాకు మళ్ళీ వడ్డీతో కూడా చివాట్లు తగిలిస్తారు అనుకొని ఎల్లాగయినాతక్కువకు పోయించుకు పోవలెనని పట్టుపట్టింది. పట్టుపడితేయమపట్టు. నాలుగు బజార్లు తిరిగింది. అదేమి అన్యాయమోకాని ఎక్కడా నసే మిరా తక్కువకు పోయమన్నారు. "ఆ! అప్పుడే అనుకొన్నా. ఆసుబ్బమ్మముండ ఎదురుగా వచ్చింది. అది వస్తే ఏంపని చేయబోయినా ఆ పని పాడే" అని సుబ్బమ్మను తిట్టి ముఖాన చెమటబొట్లు గోట చిమ్ముకుంటూ ధైర్యంతో మళ్ళీ బయలుదేరింది. ఎంతో తిరిగింది. కాని కార్యం లేకపోయింది. బజారుధరలు ఇంతేకాబోలు పాపం ఆయన విషయమై అన్యాయంగా విసుక్కొనేదాన్ని అని కొంతసేపు విచారించి మళ్ళీ ఎక్కడనైనా పోయకపోతారా బేరంచేస్తే అని చిల్లరము కాణాల మీదకిపోయింది.

ఏమోయి తెల్లనూనె ఎల్లా పోస్తావు. సీసా?

పదికానులండీ.

మేము బేరం చేసే వచ్చాము. అక్కడ బేడాకు పోస్తామనే అన్నారు. అణాన్నరకు పోయమన్నాము. ఆకాడికి పోస్తావా?

—ఎబ్బె! మీతోడండి! బజారు ధర అంతేనండి. మీబోటి గొప్ప మా రాజులే బేరం చేస్తే మేము ఎల్లా బ్రతకా

లండీ అన్నాడు.

—కాదు మా యింటి ప్రక్కన కామమ్మ పోయించుకొంది ఆకాడికి పోస్తావా?

—గిట్టదండి

సరేలే పోనీ అని వెళ్ళిపోయింది. నాలుగుగంటలైనా కూడా ఎండాకాలం కావటంచేత వేడి ఎక్కువగానే ఉంది. కాంతం ముఖం వాడిపోయింది. చెమట ముత్యాలలాగా ముఖమంతా ఏర్పడ్డది. పాపం ఇంకా తిరగటం మొదలెట్టింది. ఒకమూల ఒక అరవవాడు ఒకడబ్బా నూనె పెట్టుకొని మారుబేరానికి అమ్ముకొంటున్నాడు. వాడి దగ్గరకు కాంతం వెళ్ళి,

ఎల్లాపోస్తావోయి తెల్లనూనె?

"రొంబ నల్లనూనె ఉంది అమ్మా రెండుఅణాన్నరాసీసా"

"నల్లనూనె ఏమిటి నాకొద్దు అది. తెల్లనూనె ఉన్నదా. బేరం చేయకుమరి అణాన్నరకు పొయ్యి"

బజారులో అంతా ధరయిదే. అమ్మముందినూనె పోస్తాను నల్లనూనె అంటె రొంబ మంచీనా ఉంది.

అణాన్నరకు పోస్తావు?

బేడా అర్ధనా తక్కువరాదు.

సరే పోనీలే అని కాంతం బయలుదేరింది. కొంచెం దూరం పోయినతరువాత పిలిచి,

"అమ్మా, అమ్మణీ రాఅమ్మ అట్లా పూడుస్తావేమి.

ఏదో ఒక వెలకు పోయించుకోమీ"

"పూడవటం ఏమిటి నీబుగ్గి—అణాన్నరకు సీసా పొయ్యి"

"ఒకటీ ముక్కాలుఅణా-ఏమమ్మా ఏమంటావు"

"అణాన్నరే"

సరిదా! నీవుచూస్తే రొంబగట్టిమనిషిదా కన్పడతావు. తే. అమ్మ సీసా-ఇది రహస్యంగా ఉంచు-ఏమో షాహుకారుకు తెలియకుండా తెచ్చినసొమ్ము ఇది. మీలాంటివారికి అమ్మి బ్రతుకుతాను. ఎంతవస్తే అంతేకదా

సరే పొయ్యి అన్నది. కాంతం. డబ్బాలోనుంచి వాడు తెల్లటినూనె పోస్తుంటే కాంతం ముఖం వికసించింది. పుష్పం లాంటినూనె తక్కువధరలో వచ్చింది. దొంగసొమ్మో దొర సొమ్మో. నిప్పుపెట్టెలుకూడా అక్కడే చౌకగా పావలాకు కొని ఇంటిదారిపట్టింది. నేను డజను ఆరుఅణాలకు రోజూకొంటె తానుతక్కువధరకే కొని తెచ్చింది.

అప్పటికప్పుడే సాయంత్రముపడింది. చీకటి మెల్లగా కమ్ముకొస్తున్నది. నేను స్కూలునుంచివచ్చి పడకకుర్చీలో కూర్చొనిపక్కనే బెంచిమీద కూర్చున్న బడిపిల్లలతో మాట్లాడుతున్నాను. కాంతం ఇంకా ఇంటికి రాలేదేమని కొంచెం భయం వేసింది. ఇద్దరు కుర్రవాళ్ళను "బజారువైపుకు పోండిరా" అని పంపాను. నేను మటుకు సాహితి పత్రిక చదువుకొంటూ పడుకొన్నాను.

"దారిలో వెధవముండవాళ్ళుఉంటారు. రెండుదెబ్బలేస్తే

ఏమిటిదిక్కు. అదీ కుర్రవాళ్ళు వెళ్ళారాయె" అని అనుకొంటూ ఉండగానే వీధిలో, కాంతం గొంతు వినిపించింది. పిల్లలూ ఆమె యింట్లోకి వచ్చారు. ఆమె ముఖం పుష్పము లాగ వికసించిఉన్నది. చిన్నచిన్న గంతులు వేసుకొంటూ యింట్లోకి వెళ్ళింది. ఆమె నడకలు ఆ ముసిముసి నవ్వులు విజయభేరీని నాహృదయంలో ధాం ధాం అని కొట్టినవి. నాగుండె జారిపోయింది. సంగతి సందర్భాలు బోధపడ్డవి. నా తెలివి తక్కువ నేటితో లోకానికి టాం టాం అవుతుంది. కాంతం ప్రత్యక్షంగా "ఇదిగో కిరసనాయిలు అణాన్నరకీ కొన్నాను. మీరు ఈనూనెనే బేడార్ధానికు కొన్నారు అని చూపించి ఢంకామీద దెబ్బకొట్టినట్లు నాబుద్ధిమాంద్యాన్ని ప్రపంచానికి తెలియపరుస్తుంది. అదిగాక హైస్కూలు పిల్లలు నాదగ్గర ఉన్నారు. వాళ్లు ఉన్నారని ఏమైనా జంకుతుందా. ఎవరున్నా సరే. భగవంతుడున్నా సరే. అనవలిసినమాట అనే తీరుతుంది. నదురూ బెదురూ లేదు. పరాజయం పొందటానికి సిద్ధపడి కూర్చున్నా. ఏంచేసేది?

లోపల వస్తువులు పెట్టి-చూచారా మరి. ఏమైనలంటే మీకు కోపం అని ఉపోద్ఘాతం మొదలు పెట్టింది-నేనేమి జవాబు ఇవ్వక పూర్వమే తిరిగి ఉపక్రమించి—మరి ఏమన్నా అంటె కోపమాయె, మీకు సంసారం చక్కగా చేసుకోటం తెలియదు. అని దీర్ఘోపన్యాసానికి పూనుకొన్నది:

నేను తెలియక ఏంజేశాను అన్నాను.

ఏం జేశారని చెప్పేది. ప్రతివస్తువ కొనడంలోనూ ఒకఅణా ఎక్కువ పెడతారాయె. అణాలు పోగొట్టితే రూపాయలు ఎల్లామిగులుతవి?. బేరంచేయుటం తెలియనాయె. అడదాన్ని నేనువెళ్ళి ఎన్నని బేరంచేసేది. మీరు ఆరుఅణాలకుకొన్న రాచిప్ప నేను అయిదణాలన్నరకే కొన్నాను. కిరసనాయిలు ఒకఅణా తక్కువకే కొన్నాను. నిప్పుపెట్టెలు చౌకగా కొన్నాను. ఈమూడువస్తువులలో ఎంతలాభంకలిగిందో చూడండి. మీరు కొంటే ఎంతనష్టం కలిగేదో! మీరు ఇల్లాగే బేరం చేస్తే సంసారం దివాల అవుతుందంటె విపరీత మేమున్నది. అని సరసంగా ఉపన్యాసం ముగించింది.

నేను ఆట్టేమాడక కిరసనాయిలు ఎట్లా ఇచ్చాడబ్బా అని ఆలోచించాను. నిజంగా తెలివితక్కువబేరం చేశానను కొన్నాను. కాంతం నిజంగా తెలివిగలదని తీర్మానించు కొన్నాను. తెలివిగలది కాకపోతే కిరసనాయిలు నిప్పుపెట్టెలు అంత సరసమైన ధరకు ఎల్లా తెస్తుంది చెప్పండి? ఆఖరుకు నేనన్నాను "సరేలే నాతోవాదము ఏమిటి లోపలికిపోయి దీపంవెలిగించి భోజనంఏర్పాటు చెయ్యి అన్నాను.

"అదెంతలోకి లెండి? మీబేరానికి చెప్పాను? ఇకనుంచి అయినా జాగ్రత్తగా ఉండండి" అని లోపలికి పోయింది.

కాంతం లోపలికి పోయి చమురు బుడ్డిలోను లాంతరులోను పోసి వెలిగించుటకు నిప్పుపెట్టె వెలిగిస్తే తుప్ తుప్ మని ఆరిపోయింది. రెండోపుల్ల గీచినా అంతే అయింది.

అయిదారు పుల్లలు గీచినది. అన్నీ అంతే అయినవి. కాంతం కొంచెం వివర్ణ అయింది.

"ఏమబ్బా!"

"ఏమబ్బా ఏమిటి? అవిమండవు.

"మండకేమి? రేపు అవే మండుతవి. ఇవ్వాళ తడిసినవి" అన్నది కాంతం.

"నడిఎండాకాలంలో తడవడమేమిటి. అందులో ఇప్పుడే ప్యాకెట్టు విప్పుతుంటిని."

"మరి ఎందుచేత నంటారు"

"ఎందుచేతనో" అని గట్టిగా నవ్వాను."

మోసపోయినానా ఏమిటి చెప్మా అని అనుకొంది కాబోలు. పాపం మళ్ళీగీచి చూచింది. మండలేదు. బడిపిల్లలంతా విరగబడి నవ్వుతున్నారు. నేను వెంటనే ఒకపిల్లవాణ్ణి సరసమ్మగారింటికి పంపి అగ్గిపెట్టె తెప్పించాను.

లాంతరు తుడిచి వత్తి కత్తిరించి నిప్పుపెట్టె వెలిగించితే అదేమిచిత్రమో కాని వెలగదు. వత్తి పైకిలాగి మళ్లీ వెలిగించినా అంతే. చమురు ఎక్కటంలేదేమో అని చమురులో ముంచింది వత్తిని. అటుతరువాత వెలిగించినా వెలగలేదు. పిల్లకాయలు విరగబడి నవ్వినారు. ఎన్నిసార్లు చమురులో ముంచి వెలిగించినా వత్తి ససేమిరా వెలగలేదు. పైగా చిటపట లాడుతుంది.

నాకూ అంతకంటె నవ్వొచ్చింది. అంతాకలసి నవ్వాము.

కాంతం నన్ను తెలివితక్కువవాణ్ణి అని విసుక్కున్న మాటలన్నీ జ్ఞాపకంవచ్చి ఒక్కమారు కసి తీర్చుకోవాలెనని, ‹ఇదుగో కనబడ్డదా తెలివిగల బేరం? మహా మేధావివి తెచ్చావు వస్తువులు చౌకగా! ఇంటిదగ్గర కూర్చోని బజారు నుండి చచ్చీచెడి తెస్తే అది బాగుండలేదు. ఇది బాగుండలేదు. వంకాయలు లేతగాలేవు. చీర పండులాగ ఎఱ్ఱగాలేదు. అనటం అనుకొన్నావా' అన్నాను.

కాంతానికి ఎక్కడలేని అభిమానమూ సిగ్గూ దొంతర్లుక్రింద వచ్చినవి. కొంచంసేపయినతరువాత ఏమనుకొందో లేని చిరునవ్వు తెచ్చుకొని నిజంగా మోసం అంది అపజయం సూచించే డగ్గుత్తికతో—

‹సందేహ మేమిటి ఎక్కడ కొన్నావు.

‹రావిచెట్టుక్రింద అరవవాడి కొట్లో.

‹అక్కడే కొన్నావు? వాడు టక్కరుముండావాడు. వాడు చమురులో బూడిద నీళ్లుకలిపి మోసంచేస్తాడు. మాకు తెలుసు. అందుకని అక్కడికివెళ్లము. నిప్పుపెట్టెలు మాయవి అవిమండవు. ఇంకేం కిరసనాయలు పారబొయ్యి, అన్నాన అప్పుడు కుర్రవాడిని బజారుకు పంపి నూనె తెప్పించి దీపం వెలిగించుకొని వంట వండుకొని భోజనంచేసేసరికి పదకొండు గంటలయింది.

నేనూ మా కాంతం

నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు నేను ఈరోజు ఇంట్లో భోజనం చెయ్యను, భోజనం ఏమిటి, పచ్చిమంచినీళ్ళు తాగను. కాకపోయినా నీఆగడం ఎక్కువైపోయింది. ఎన్నాళ్ళని భరించి ఊరుకొనేది. నాకు ఈరోజు ఇంట్లో భోజనం చెయ్యటానికే మనస్కరించటంలేదు. నేను హోటలుకు పోక మానను.

క్షమించండి—నేనేమన్నాను.

క్షమించటం అన్నమాట నా చెవిని పడకూడదు. ఒంటరిగా ఏకాంతంలో ఎన్ని పరాభవాలన్నా భరిస్తానుగాని పదిమంది స్నేహితులలోనూ నన్ను పరాభవంచేస్తే నేనేమిటి చేసేది అన్నాను. క్రిందటిరాత్రి జరిగిన పరాభవం తల్చుకొని కోపంచేత ఒళ్ళు మండిపోయి ఆరోజు హోటలుకు వెళ్ళాను. అంతకు పూర్వం ఎన్నో పరాభవాలు అనుభవించి పొట్టలో పెట్టుకొని ఊరుకొన్నాను. నేను కోపదారినే అంటారా?

కాంతంతో పోట్లాట ఎందుకు? ఎల్లాగో సద్దుకుపోండి అంటారు. ఎలాగు? భర్తను గౌరవించటం పోయింది సరిగదా పైగా నన్ను వెంకట్రావూ—వెంకట్రావూ అని చులకన చేసి నెమ్మదిగా పిలవటం. వినపడదు అనుకొంటుంది-కాబోలు వెఱ్ఱిబాగులది.

పోనీ దానికేమని ఊరుకొన్నాను. నా తలగుడ్డ చూచి